మనుష్యులకుంగల స్వేచ్ఛ

తారకం ఎలాగైతేనేం వచ్చాడు. వచ్చాడంటే, బుద్ధిపూర్వకంగా అమ్మను నాన్ననూ తమ్ముళ్ళనూ చూడాలన్న కోరికతో రాలేదు. రమ్మని ఉత్తరాలమీద ఉత్తరాలు తండ్రి రాయగా, రాకుండా ఉండటానికి వంకలన్నీ అయిపోయాక, ఏడాది తరవాత వచ్చాడు. వాడు రైలుబట్టలు విడిచి, స్నానమైనా చెయ్యకముందే, దుర్ముహూర్తాన వచ్చాడని వాళ్ళ అమ్మకు తోచింది.

వాడు హోల్డాలు హాల్లో పడేసి, దానిమీద కూర్చుని తండ్రి ప్రశ్నలకు జవాబులు చెబుతుండగా లచ్చి వచ్చింది. రేపటినుంచీ పనిలోకి వస్తాననీ, ఇంకా తనకు బదులు సరస రాదని చెప్పటానికి.

తారకం లచ్చికేసి ఎగాదిగాచూసి, "ఇదా మన పనిమనిషి? నూరు లంఖణాలు చేసినట్టుం దేమిటి?" అన్నాడు.

"నూరు కాకపోతే పాతిక లంఖణాలైనా చేసింది. చచ్చి బతికింది. నలభై రోజులు నాగా పెట్టింది" అన్నాడు తండ్రి.

"జీతం డబ్బు లిచ్చారా?" అన్నాడు తారకం అర్థంలేకుండా.

"నీదంతా సోద్దెంరా! నెలపైన పని చెయ్యకపోతే జీతం ఎవరిస్తార్రా? దీని బదులు సరసచేత పని చేయించుకొని దానికిచ్చాం డబ్బులు" అన్నది తల్లి.

"అంటే. ఈమెకు పొలాలమీదా, ఇళ్ళ అద్దెలమీదా వస్తుంది గామాల్లే!" అన్నాడు తారకం.

వాడి తల్లీ.తండ్రీ ఒకరి మొహాలొకరు చూసుకుని తారకంకేసి వింతగా చూశారు.

"ఏమిటి నువ్వనేది? ఆమె పాచిపని చేసుకునేది. ఆమెకు పొలాలేమిటి? ఇళ్ళమీద అద్దెలు రావటమేమిటి?" అన్నది తల్లి.

"నేను ఓ కథ రాశాను," అన్నాడు తారకం తండ్రినే చూస్తూ. "అందులో పాచిపని చేసుకుబతికే మనిషి ఒకతె బ్రహ్మదేవుణ్ణి గురించి తపస్సు చేస్తుంది. బ్రహ్మ ప్రత్యక్షమై ఏం వరం కావాలని అడుగుతాడు. 'తండ్రీ, అష్టైశ్వర్యాలు అడుగుదును గాని. అవి ఇయ్యడం నీతరం కాదు. అయిశ్వర్యాలు అయిశ్వర్యవంతులకే వస్తాయి. కాని నువ్వు ఒకపని చెయ్యి.నాకు ఎన్నడూ ఎలాంటి జబ్బూ చెయ్యకుండా. ఏమందులూ అవసరం లేకుండా వరం ఇయ్యి,' అంటుంది.

"వెనకటికి రాక్షసులు చావులేకుండా వరంఅడిగినట్టుగానా" అన్నాడు తండ్రి. కొడుకు ధోరణి కొంతవరకు అందుకొని కూడా దాన్ని నిరసిస్తూ.

"బ్రహ్మదేవుడికి అదే అనుమానంవచ్చి. 'నీవు చావులేకుండా వరం అడుగుతున్నావు. వెనక రాక్షసులకయితే అలాంటి వరాలిచ్చాను గాని, నీలాంటి ఒక్క ప్రాణులకు జరామరణాలు లేకుండా వరం ఇయ్యటానికి చట్టం ఒప్పదు'అనేశాడు" అన్నాడు తారకం.

"తరవాత ఏమయింది?" అని తండ్రి అడిగాడు.

"ఏమవుతుందీ? 'సరే ముందు రాక్షసినయి మళ్ళీ వొస్తాను' అన్నది పాచిపని చేసుకునేది" అన్నాడు తారకం.

"ఈ కథను ఎవరు అచ్చేశారు?" అన్నాడు తండ్రి.

"ఎవరూ వెయ్యలేదు. అలాంటి కథ ఎవరూ చదవరని నా స్నేహితులుకూడా చెప్పారు. అదీగాక ఈ కథ సాంఘిక అశాంతికి దారి తీస్తుందన్నారు."

"ఎలా?" అని తండ్రి సవాలు చేస్తున్నట్టుగా అడిగాడు.

"ఒకవేళ బ్రహ్మదేవుడు వరమిస్తే ఈ పాచిపని చేసే ఆమె తన కొడుకును ఐ. ఎ. యస్. పాస్ చేయించి తనచేత పనిచేయించుకున్న వాళ్ళందరినీ ఏదోవిధంగా శిక్షించవచ్చు."

"పాచిపని చేసి కొడుకును ఐ.ఏ.యస్. పాస్ చేయిస్తుందా?" అన్నాడు తండ్రి ఆశ్చర్యంగా.

"సినిమాలలో అడపా దడపా అలా జరుగుతూనే వున్నదిలే! ప్రొడ్యూసరు రాయమన్నట్టు కథ రాసినందుకు పాతికవేలు పుచ్చుకునేవాళ్ళు అంత తెలీకుండా రాస్తారా?" అన్నాడు తారకం

కొడుకు మంచి జోక్ వేసినట్టుగా తండ్రి గట్టిగా నవ్వేశాడు.

"దీనికి ఎంత జీతం ఇస్తున్నాం?" అన్నాడు తారకం విషయం మార్చి.

"ఇరవై ! అంతకు తక్కువ రారు నాయనా! వెనకటి రోజులుకావు!" అన్నది తల్లి.

"ఇరవై రూపాయలా? అంటే ఓ వారంపాటు ఈమెకు రెండు పూటలా తిండి ఉంటుందన్న మాట! మిగిలిన మూడు వారాలూ ఏం తింటుందిటా?" అని తారకం ఆశ్చర్యపోయాడు.

తండ్రికి చర్రుమని కోపం వచ్చింది. "అధిక ప్రసంగం! అది మనకెందుకూ!" అన్నాడు.

"మనింట్లో నెల పొడుగునా, ఏడాది పొడుగునా పనిచేసే మనిషి సమస్యలను గురించి మనకు ఏదో అవగాహన ఉండాలిగదా! బొత్తిగా నూతిలో కప్పలల్లే, మనకు సంబంధంఉన్న మనుషుల మంచిచెడ్డలు పట్టించుకోకుండా ఎలా ఉంటాం?" అన్నాడు తారకం.

వ్యవహారం జోక్ దాటుతున్నది.

"సరే నువ్వు వెళ్ళవే." అన్నాడు తండ్రి లచ్చితో.

"లేచి స్నానం చెయ్యరా. అన్నం పెడతాను." అన్నది తల్లి.

2

భోజనాలయినదాకా అసలు విషయం చర్చకు రాలేదు. తల్లిదండ్రులు తారకాన్ని రమ్మన్నది పెళ్ళి సంబంధాలు చూడటానికి.

"అందమైన పిల్ల కావాలంటే వున్నది. కట్నం బాగా ఇచ్చే పిల్లతండ్రీ వున్నాడు. బాగా చదువుకున్న పిల్లలుకూడా వున్నారు. నలుగురినీ చూశావంటే నీకు కావలసిన పిల్ల ఇట్టే దొరికిపోతుంది" అన్నది తల్లి.

"నాకు కావలసింది ఇవన్నీకాదు. నాతో సమంగా పరిగెత్తగల పెళ్ళాం కావాలి నాకు. దొరకటం కష్టం." అన్నాడు తారకం.

"ఒలింపిక్స్‌కు ఎంటర్ చేస్తావా ఏం?" అన్నాడు తండ్రి వెటకారంగా.

తారకం ఎంతో సహనంతో నవ్వి, "ఇది రికార్డులు స్థాపించే రేస్ కాదు. ఇది హర్డిల్ రేస్. ఇప్పుడున్న స్థితిలో నేనా కాబోయే భార్య నన్ను అందుకోవటానికి చాలా అవాంతరాలు దాటుకుని రావాలి" అన్నాడు.

"ఏమిటవి?" అన్నాడు తండ్రి.

"ఎందుకడుగుతావు? పనిమనిషి విషయంలోనే మనం తూర్పు-పడమరలుగా వున్నాం. ఇలాటివి జీవితంలో వేలూ,లక్షలూ వున్నాయి. నేను నా విశ్వాసాలన్నిటినీ బయటపెట్టి ఏం బావుకుంటాను?" అన్నాడు తారకం.

"ఆ పనిమనిషి విషయంలో నేను నీతో కామన్‌సెన్స్ మాట్లాడటానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు తండ్రి తనకు అపజయం అసాధ్యమన్నట్టు.

"కామన్‌సెన్స్ చెప్పండి. రోజుకు నాలుగు గంటలు మన ఇంట పనిచేసి, ఇరవై రూపాయలమీద ఎట్లా బతుకుతుంది? మరో నాలుగుగంటలు ఇంకో ఇంట్లో పనిచేసి ఇంకో ఇరవై సంపాదిస్తుందనుకుందాం. నలభై రూపాయల నెలజీతంతో ఒక మనిషి ఎలా బతుకుతుంది? ఇంకొకరిని పోషించటం మాట ఎత్తనే వద్దు."

"దాని ఇంట ఇంకా సంపాదించే వారుండరాదా! అది పదహారేళ్ళ పిల్ల. తల్లిదండ్రుల వెంట ఉంటున్నది. వాళ్ళూ పని చేసుకుంటారు. చన్నీళ్ళకు వేణ్ణీళ్ళు-"

"మనం ఆమె కుటుంబ వ్యవహారాలు చర్చించేటందుకు అరులంకాము. ఆమె డబ్బుతోనే మనకు సంబంధంలేదు. ఆమె తల్లిదండ్రుల సంపాదనతో మనకేం సంబంధం. కాకపోయినా మనకోసం శ్రమచేస్తూ తండ్రి సంపాదనమీద బతుకుతున్నదంటే మనకెంత అవమానం!"

తండ్రి మొహం ఎర్రగా అయింది.

నీవు ఏలోకంలోఉండి మాట్లాడుతున్నావు? ఆమె స్వతంత్రజీవి. మన జీతం చాలకపోతే పని మానెయ్యొచ్చు. అలాగే మనము స్వతంత్రులం. ఆమెకు జబ్బుచేసి పనిచెయ్య లేకపోతే పని మానిపించి ఇంకొకర్ని పెట్టుకుంటాం," అన్నాడు తండ్రి.

"నువ్వు చెప్పేదికూడా ఏమంత వాస్తవంగాలేదు. నువ్వుచెప్పే స్వాతంత్ర్యం మనకూ లేదు. ఆమెకీ లేదు. మాటవరసకు ఒకపూట గడిచే జీతం ఒకరు ఇస్తామనీ, ఇంకొకరు అంతకన్నా తక్కువ ఇస్తామంటే ఆమె మొదటివాళ్ళకే వచ్చినట్టు పని చేయాలి. ఆమెకున్న స్వేచ్ఛ ఏ పాటిదో ఆమె ఆకలి నిర్ణయిస్తుంది" అన్నాడు తారకం.

"ఆమెకు రెండుపూట్లా తినేటట్టు జీతం ఇచ్చే స్వేచ్ఛ ఎవరికీ లేదా?" అన్నాడు తండ్రి.

"లేదనుకుంటాను."

"అనుకోవడం రుజువుకాదు," అన్నాడు తండ్రి. తానే గెలిచిన గొంతుపెట్టి.

"మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకుంటారా ? నేను వీడితో సంబంధాల గురించి మాట్లాడాలి" అన్నది తల్లి తన భర్తతో.

"మహారాజుగా!" అని తండ్రి లేచివెళ్ళి దక్షిణపుగదిలో మంచంమీద నడుం వాల్చాడు.

3

లచ్చు పని పూర్తిచేసి, "పోతున్నా నమ్మగారూ ?" అని చెప్పి బయటకు వెళ్ళటమూ దాని వెనకనే కొడుకు వెళ్ళటమూ తల్లి చూసిందిగాని, ఏమీ శంకించలేదు.

"ఆగు !" అని తారకం అనటం విని లచ్చు ఆగింది

తారకం దాన్ని కలుసుకొని వెంట నడుస్తూ "బక్కచిక్కి వున్నావు. అప్పుడే పనిలోకి ఎందుకు వచ్చావు ?" అని అడిగాడు.

"జరగొద్దా, బాబూ ?" అన్నది లచ్చు.

"ఇన్నాళ్ళూ ఎట్లా జరిగింది. నీకు మందులకే బోలెడంత అయివుండాలే? మీ ఇంట్లో ఎవరు సంపాదించేవాళ్ళు?"

"మా నాన్న పని చేస్తాడు. ఆ సంపాదన ఏ మూల ? నాకు జబ్బు నయమయిందాకా సరస మా ఇంట్లోనే వుండి తన సంపాదన అమ్మకిచ్చింది."

"సరస అంటే నీకు బదులు పనిచేసిన మనిషా?"

"అవును. వెయ్యేత్తి దణ్ణం పెట్టాలి. అది చిన్నపిల్లగా ఉండగా దాని తల్లి ఎవడితోనో లేచిపోతే, తాగుబోతు తండ్రి పట్టించుకోకుండా తిరిగితే, మా అమ్మ చేరదీసిందట. మనిషికి మనిషి తోడేగాని డబ్బు కాదంటుంది."

"దానికి సంసారం లేదా ?"

"పెళ్ళయిందిట. మొగుడు వదిలేశాడు, ఒంటరిగా బతుకుతుంది. ఇదిగో ఈ అయిదా రు వారాలనుంచీ——"

"ఇదుగో !" తారకం జేబులో చెయ్యిపెట్టి, పది రూపాయల నోట్లబొత్తి తీసి పదినోట్లు ఎంచి లచ్చుకిస్తూ, "ఇది నీకు న్యాయంగా మా అమ్మ ఇవ్వవలసిన జీతం. నువ్వు తీసుకుంటున్న జీతం చాలాతక్కువ. దాన్నిగురించి తరువాత ఏదోచెయ్యాలి. ప్రస్తుతం ఈ డబ్బు మీ అమ్మకియ్యి. నువ్వు పళ్ళు, పాలూ బాగాతాగు. పనిమనిషి వస్తాదులా గుండాలి. తెలిసిందా?" అన్నాడు.

లచ్చు చెయ్యి వెనక్కు పెట్టుకుని, డబ్బు తీసుకొనటానికి బెదిరింది.

"మీలాటి వాళ్ళకు డబ్బంటే భయం. అందుకే పొట్టగడవని జీతాలకు ఒళ్ళు విరుచుకుంటారు. నడిబజారులో ఇస్తున్నాను. నేనిచ్చానని, ఇది నీజీతమనీ మీఅమ్మకు చెప్పు. ఇందులో దాపరికం ఏమీలేదు. అంటే నన్నంటారేమోగాని నీమీద మాట రాదు." అంటూ డబ్బు లచ్చుచేతిలోపెట్టి, తారకం వెనక్కు వెళ్ళిపోయాడు.

"మంచి బేరం తగిలిందే, పిల్లా !" అంటూ ఒక నడి వయసువాడు ఇకిలించి తల ఎగరేశాడు.

లచ్చు దడదడలాడే గుండెతో ఇంటికి పోయింది.

బాంబు పేలటానికి ఎంతోకాలం పట్టలేదు. ఆ సాయంకాలం పనికి లచ్చు రాలేదు. దాని తల్లి వచ్చింది——పనిచెయ్యటానికి కాదు, పోట్లాడటానికి. వస్తూనే అది పది రూపాయల నోట్లు తారకం తలికిస్తూ, "ఇంతకాలంనుంచీ చూస్తున్నారు, మేం ఇట్లాంటివాళ్ళమని ఎట్లా అనుకున్నారు ?"

ఆ సమయానికి తారకమూ, తండ్రీకాక, తారకం పినతల్లి కొడుకు కాముడు కూడా వున్నాడు.

లచ్చు తల్లి ఏమంటున్నదో ఒకంతట తారకం తల్లికి అర్థం కాలేదు. అతని తండ్రి మటుకు, తన కొడుకు ఇటువంటి పని ఏదో చేస్తాడని ఊహించిన వాడిలాగే కనిపించాడు.

ఆయన లచ్చు తల్లితో, "చూడు, రాజమ్మా నీ కూతురు ఖాయిలా పడిందనీ, ఖర్చయిందనీ తెలిసి మావాడు డబ్బు సర్దాడు. అప్పుగా ! దాన్ని నింపాదిగా నువ్వు తీర్చేసుకో. ఈ భాగ్యానికి ఇంత హంగామా దేనికీ ?" అన్నాడు.

"మా అమ్మాయి అప్పుకావాలని అడిగిందాండీ? చిన్నపిల్ల చేతిలో నూర్రూపాయలు పెట్టటంలో మీ అబ్బాయిగారి ఉద్దేశం ఏమిటో ఎవరన్నా అడగండి! పైగా పెద్దవాళ్ళతో చెప్పమన్నార్ట! మేం కూడా సంతోషిస్తామని గామాలు! ఎందుకని అంత లోకువయాం బాబూ ?" అన్నది రాజమ్మ.

"నీకు అవసరం లేకపోతే ఇచ్చెయ్యగలందుకే నీతో చెప్పమనుంటాడు. ఇచ్చేశావుగదా ? ఇంకేమిటి పేచీ ?" అన్నాడు తారకం తండ్రి.

"ఇంతకీ నీ కూతురేదీ? అంట గిన్నెలు, అవీవున్నాయి" అంది తారకం తల్లి.

"ఏ మొహం పెట్టుకొని వస్తుందమ్మా? పని మానుకోమన్నాను" అన్నది రాజమ్మ—తారకంకేసి కొరకొరా చూస్తూ....

"అదేమిటీ! మావాడు పెళ్ళి సంబంధాలు చూడటానికి వచ్చాడు. రేపు మళ్ళీ తిరిగి వెళ్ళిపోతాడు. నిక్షేపంలాంటి వాడిక మానేస్తావా? ప్రస్తుతం ఆ రెండుగిన్నెలు తోమిపెట్టి రేపొద్దున్నైనా పిల్లదాన్ని పంపించు!" అన్నది తల్లి.

అంతదాకా మాట్లాడని తారకం అకస్మాత్తుగా కలగజేసుకుని, "మనది మంచి వాడిక అని వాళ్ళు అనుకోవాలి. మనమే చాటించుకోరాదు. మనది మంచి వాడికకాదు! మనకన్నా తమకు చాలా ఎక్కువ నీతి ఉన్నదని చెప్పుకునేటందుకు అవకాశం దొరికింది. దానికోసం మన ఇల్లు వదులుకొని, ఇంకో ఇల్లు దొరికినదాకా పస్తులైనా ఉంటుంది. నలభైరోజులు మంచాన బడివుంటే ఎవరు ఉద్ధరించారు? అట్లాగే ఇంకోపది రోజులు డొక్కలో కాళ్ళు పెట్టుకుంటే ఇటువంటి ఇల్లే మరొకటి దొరక్కపోదు. నాన్న చెప్పినట్టు, పని మానుకునే స్వేచ్ఛ వాళ్ళకున్నది. మానుకోవద్దని నువ్వు బతిమాలావంటే. పని మాన్పించే స్వేచ్ఛ మనకు లేదన్నమాట!" అన్నాడు.

తారకం ఏమంటున్నాడో, ఎందుకంటున్నాడో ఎవరికీ అంతు చిక్కలేదు. ఎవరూ పట్టించుకోనూ లేదు. కాని అందరికన్నా అజ్ఞానం మనిషి రాజమ్మ ఉద్రేకమంతా ఎందుకో చల్లారింది. తారకం గొంతులో తప్పచేసి దొరికిపోయి సిగ్గుతో చచ్చిపోతున్నవాడి లక్షణాలు లేవు. రాజమ్మ కోరిన సంతృప్తి వస్తున్నట్టే కనిపించి చప్పున అదృశ్యమయింది. ఆమె కొంగు బొడ్లో దోపుకుంటూ అంట్లగిన్నెలు తోమడానికి సిద్ధమయింది.

కాముడు విరగబడి నవ్వి. "దొరక్క దొరక్క నీకు లచ్చి ఎక్కడ దొరికిందిరా! నువ్వుదానికి డబ్బిచ్చింది చేసిన పనికా, చెయ్యబోయే పనికా?" అని తన జోక్‌కు మళ్ళీ నవ్వాడు. అతడు తాను వెయ్యబోయే జోక్‌కు ముందు తాను నవ్వి అందరితో కలసి నవ్వుతున్నాననుకొని తరవాత ఇంకోసారి నవ్వుతాడు.

తల్లి. "హవ్వ! హవ్వ!" అనుకుంటూ మళ్ళారంగంలోకి వచ్చి, "ఏం పనిరా ఇదీ? నీకు పిల్లనిస్తామని ఎంతోమంది సిద్ధంగా వున్నారు. ఈ సంగతి తెలిస్తే ఇంకేమైనా వుందా?" అన్నది.

తారకం తండ్రి మండిపడి, "నువ్వెళ్ళి మా వాడు పనిదాన్ని ఉంచుకున్నాడని అందరితోటీ చెప్పిరా!" అన్నాడు.

"నే చెప్పకపోతే ఆగుతుందా ఏం?" అన్నది తల్లి.

"ఎందు కాగుతుంది? సంబంధాల వాళ్ళ ఎడ్రసులు రాజమ్మ కియ్యి!" అన్నాడు తండ్రి.

ఇద్దరూ వాగ్వాదాలు పడేటట్టు కనిపించారు. తారకం అడ్డంవచ్చి, "నేను నీతి పరుణ్ణని ఎవరెవరికి గ్యారంటీ ఇచ్చారేం? ఎవరు మానుకున్నా కట్నం ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు మానరు. తాగుడుకూ, ముండలకూ తగినంతఉంటేగాని కట్నాలు పొయ్యరు. తరువాత వాడు తాగకపోతే వాడి ఖర్మ! చూడు, నాన్నా శ్రమ అమ్ము కునే మనిషికన్నా ఒళ్ళు అమ్ముకునే మనిషికి ఎక్కువ ఇయ్యొచ్చుననే నీ నమ్మకం కూడా. నీ నమ్మకమేమిటి, రాజమ్మ నమ్మకమేమిటి అందరి నమ్మకము అదేగా కని పిస్తుంది. అదిపోనీ, నేను చెప్పదలచుకున్నది నీవుచెప్పే స్వేచ్ఛ లేదని. పనిమనిషికి హెచ్చు డబ్బిచ్చే స్వేచ్ఛ మనకు లేదు. తీసుకునే స్వేచ్ఛ ఆమెకీలేదు" అన్నాడు.

"ఇది రుజువు చెయ్యటానికా దానికి డబ్బిచ్చావు ?" అన్నాడు తండ్రి.

"కాదు. న్యాయంగా మనం ఆమెకి బాకీ ఉన్నామనుకునే ఇచ్చాను. నేను నీ నమ్మకాలు మార్చుతానా ? ఎవరి నమ్మకాలు వారే మార్చుకోవాలి. నిజం తెలుసు కుంటూపోతే మనం చాలాదూరం పోతాం. అశాంతి తిరుగుబాటు, విప్లవాలు ప్రత్యక్ష మవుతాయి. అందుచేత శాంతంగా ఉండదలచినవాళ్ళు కొన్ని అబద్ధాలను నమ్మి లోకంలోసాగే అన్యాయంలో భాగం పంచుకోవటం మంచిది." అన్నాడు తారకం.

తారకం తండ్రి క్షణంపాటు ఆలోచించేవాడి మొహంపెట్టి మరుక్షణం ఆలో చనను దులిపేసుకున్నాడు.

తారకం మర్నాడే రైలెక్కాడు. వెళ్ళేముందు అతను తన పెళ్ళి అదివరకే నిర్ణయమయిందని తల్లికీ, తండ్రికీ చెప్పి తనకోసం సంబంధాలు చూడవద్దన్నాడు.

"నీతో సమంగా పరిగెత్తుతుందా ?" తండ్రి అడిగాడు.

"చూడాలి! నేను తనతో సమంగా పరిగెత్తగలనా అన్న అనుమానం ఇంకా పోలేదు," అన్నాడు తారకం.

"ఏడవకపోయావు!" అనుకున్నాడు తండ్రి.

—ప్రచురణ : ఆంధ్రజ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, నవంబరు, 1978